క్లుప్తంగా

చల్లబడిన వాతావరణం



మాడుగులలో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్: మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడింది. ఈ వర్షం వరి నాట్లకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంఈవో

గొలుగొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంఈవో సత్యనారాయణ,సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో 210 మంది బాల,బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కమిటీ చైర్మన్ రాజులునాయుడు, ఎంపీటీసీలు మామిడి కృష్ణ, బుల్లి ప్రసాద్, రుత్తల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

బుచ్చెయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట,మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవలసి జాగ్రత్తలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం అప్పలరాజు,ఎంఎల్‌హెచ్‌పీ అనిత, అంగన్‌వాడీ టీచర్లు రాధ,కుమారి,దేవి తదితర్లు పాల్గొన్నారు.

మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా రమేష్



రమేష్‌ను అభినందిస్తున్న మండల యాదవ సంఘం నాయకులు

బుచ్చెయ్యపేట: మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా వడ్డాదికి చెందిన సింగంపల్లి రమేష్ ఎన్నికయ్యారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో మండల యాదవ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం కార్యదర్శి జోగా కొండబాబు, ఎంపీటీసీ దేవర అప్పారావు,మాజీ జెడ్పీటీసీలు గోకివాడ కోటేశ్వరరావు,వియ్యపు అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు

గొలుగొండ: బొడ్డేరు గెడ్డ పరిధిలో అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని కృష్ణదేవిపేట ఎస్ఐ టి.దివ్య హెచ్చరించారు. చోద్యం పరిధిలో ఉన్న ఎడ్ల బళ్ల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇసుక తవ్వకాలు చేయరాదని సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్డేరు గెడ్డలో సుమారుగా 10 కిలోమీటర్ల మేర ఇసుక నిల్వలు ఉన్నాయని, అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇప్పటికే ట్రాక్టర్ యజమానులకు హెచ్చరించినట్టు తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కె.కోటపాడు: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. పైడంపేటలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో దోమల వృద్ధి లేకుండా ఉండేందుకు మందును వైద్య సిబ్బంది వేశారు. ఏఎన్ఎం సత్యవేణి, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశ కార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయ్యాయి. ఏదో చేసేస్తారని ఎంతో ఊహించుకున్న ప్రజలకు తీవ్ర నిరాశే ఎదురైంది. చంద్రబాబు మరోసారి తన మార్కు మోసాన్ని ప్రజలకు చూపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కూడా బాబు తీరు బాగా వంటబట్టినట్టుంది. చంద్రబాబు ఏం చేసినా ఆహా..ఓహో.. అనడం తప్ప ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఒక్క పనికూడా చేయలేదు. కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఎక్కడా కానరాలేదు. తల్లికి వందనం బదులు పంగనామయం పెట్టారు. రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ ఇచ్చేస్తున్నామంటూ గ్యాస్ కబుర్లు చెబుతున్నారు. హామీలు పక్కన పెడితే కార్యకలాపాలు కూడా సక్రమంగా సాగడంలేదు. దీంతో ఏదో ఊహించుకుని ఓట్లేసి గెలిపించిన ప్రజల బతుకులు చిందరవందరగా తయారయ్యాయి. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కూటమి పాలన చిందరవందర

- 100 రోజుల పాలన.. చేసింది సున్నా.
- ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ



గోతుల మయంగా మారిన చోడవరం- నర్సీపట్నం బీఎన్‌రోడ్డు

చోడవరం: టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచీ ఇప్పటి వరకూ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదు. తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పిన ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ ఊసే ఎత్తడం లేదు. చోడవరం నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలను కలుపుతూ ఉన్న 54 కిలోమీటర్ల పొడవున్న ప్రధాన రహదారి అయిన బీఎన్ రోడ్డు పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదకరంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 112 కోట్లు మంజూరు చేశారు. అయితే రోడ్డు పని టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ టీడీపీ నాయకుడు కావడంతో ప్రభుత్వానికి మంచిపేరు రాకూడదన్న దురుద్దేశంతో నిధులు ఉన్నా ఏడాదిన్నరగా పనులు చేపట్టలేదు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, ఎంపీ సీఎం రమేష్‌లు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినా నేటికీ ఈ రోడ్డు పనులు ఎక్కడా ప్రారంభం కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డులో అడుగడుగునా పెద్దపెద్ద గోతులు పడి చాలా ప్రమాదకరంగా మారింది.

- అదేవిధంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 24వేల మంది సభ్యరైతులు ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించేందుకు చర్యలు చేపడతామని ఎన్నికల్లో వీరు హామీ ఇచ్చారు. మరో రెండు నెలల్లో ఈ ఏడాది ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ఫ్యాక్టరీలో ఈ ఏడాది క్రషింగ్ చేయాలా వద్దా అనే మీమాంశలో యాజమాన్యం పడింది. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప చెరకు పేమెంట్స్, కార్మికుల జీతాలు సకాలంలో ఇవ్వలేని పరిస్థితిలో ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు రూ. 80 కోట్ల వరకూ సాయం అందించడంతో గడిచిన ఐదేళ్లలో పెద్దగా ఇబ్బందులు లేకుండా ఫ్యాక్టరీ నడిచింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అసలు ఫ్యాక్టరీ గురించే పట్టించుకోకపోవడంతో రైతులు, కార్మికులు ఆందోళనలో ఉన్నారు. వీటితోపాటు పలు గ్రామాల్లో రోడ్లు, ఇంటింటి కుళాయిల పనులు కూడా ప్రభుత్వం చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీలు విస్మరించారు



చెరకు రైతులకు జీవనాధారమైన గోవాడ సుగర్‌ఫ్యాక్టరీని అభివృద్ధిచేసి ఆదుకుంటామని ఎన్నికల్లో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే రాజు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. ఈ సీజన్ ప్రారంభానికి సమయం సమీపిస్తున్నా ఇంకా మద్దతుధరపై ప్రకటించలేదు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ కూటమి ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం అందించి, ఫ్యాక్టరీని రైతులను ఆదుకోవాలి.

-డి. వెంకన్న, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

వాగ్దానాలు నెరవేర్చాలి



ఎన్నికల ముందు మెయిన్ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అసలు పట్టించుకోవడం లేదు. మెయినరోడ్డు మీద వెళ్లాలంటే భయంభయంగా ఉంది. వెలంకాయలపాలెం నుంచి కొత్తకోట వరకూ బీఎన్‌రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆటోలు, బైక్‌లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు ఇద్దరూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

-కోసూరి రాము, కొండపాలెం, రోలుగుంట మండలం.

ఒక్కటి నెరవేరితే ఒట్టు



నర్సీపట్నం పెద్ద చెరువు

నర్సీపట్నం: ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు ఒక్కదానిని కూడా నెరవేర్చకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని, నర్సీపట్నం పెద్దచెరువు ప్రాంతాన్ని హైదరాబాద్ తరహాలో ట్యాంక్ బండ్ మాదిరిగా తీర్చిదిద్దుతానని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తానని ఇలా చాలా హామీలిచ్చిన అయ్యన్న పాత్రుడు వాటిని పూర్తిగా విస్మరించారని స్థానికులు విమర్శిస్తున్నారు.

- 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద చెరువు వద్ద ట్యాంక్ బండ్ నిర్మాణానికి శిలాఫకం వేసి వదిలేశారు. తాజాగా జరిగిన ఎన్నికల సందర్భంగా ట్యాంక్ బండ్ నిర్మాణాన్ని చేపడతానని అయ్యన్న హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ట్యాంక్ బండ్ నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదు.
- గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇండోర్ స్టేడియం నిర్మాణం శిలాఫలకం స్థాయిలోనే నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అయ్యన్న హామీ మేరకు ఇండోర్ స్టేడియం నిర్మాణం కల సాకారమవుతోందని క్రీడాకారులు ఆశించారు. అధికారులతో కలిసి స్పీకర్ స్థల పరిశీలన చేశారు తప్ప ప్రభుత్వం వంద రోజులు కావస్తున్నా కార్యరూపం దాల్చలేదు.
- మున్సిపాలిటీలో రింగ్ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. రింగ్ నిర్మాణం జరిగితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు పట్టణం నలువైపులా అభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రజలు ఆశించారు. రింగ్ రోడ్డు హామీ అమలు ఇంకా పట్టాలు ఎక్కలేదు.
- పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణాల హామీలు అమలుకు నోచుకోలేదు. వీటితో పాటు ఉత్తరవాహినిలోని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అసంపూర్తిగా నిలిచిన సత్యనారాయణస్వామి కల్యాణ మండపాన్ని పూర్తి చేస్తామని అయ్యన్న ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు.

వంద రోజుల్లో ఒరిగిందేమీ లేదు..



కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్ తప్ప ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు విస్మరించారు. ఎన్నికల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోలేదు. వంద రోజుల పాలనలో ప్రజలకు, నియోజకవర్గానికి ఒరిగింది శూన్యం

-మాకిరెడ్డి బుల్లిదొర, నర్సీపట్నం

మచ్చుకైనా అమలుకాని హామీల అమలు



కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీల మచ్చుకైనా అమలుకాలేదు. వంద రోజుల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం. నూరు రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని విధాల విఫలమైంది.

-రెడ్డి వరహాలబాబు, నర్సీపట్నం

హామీలు గాలికి..

మాడుగుల/మాడుగుల రూరల్/కె.కోటపాడు/దేవరాపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులవుతున్నా ఆయా పార్టీ నాయకులు ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో పరిశ్రమలు,స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని, జాతీయ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చారు. అయితే ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం. రైవాడ జలాశయాన్ని ఆధునికీకరించి, రైవాడ నీటిని రైతులకు అందజేస్తామని ఎన్నికల ప్రచారంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి హామీ ఇచ్చారు. ఆ దిశగా ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. చీడికాడ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు, చీడికాడ మండలంలో అర్జునగిరి, చెట్టుపల్లి, చుక్కపల్లి, చీడిపల్లి గ్రామాల ప్రజల కోసం ఫోర్-ఎల్ సబ్ మైనర్ కాలువ ఏర్పాటు, మాడుగులలో నియోజకవర్గంలోని అన్ని జలాశయాల ఆధునికీకరణ తదితర హామీలను గుప్పించారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులవుతున్నా హామీల అమలు దిశగా చర్యలు చేపట్టకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు అమలుచేయడంలో స్పష్టత ఇవ్వకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది.

దాడులు తప్ప చేసింది శూన్యం



కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ముఖం చాటేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదు. ఇసుక కొరత ఏర్పడడంతో భవననిర్మాణాలు నిలిచిపోయి, కూలీలకు పనులు లేకుండా పోయాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులు చేయడం తప్ప వంద రోజుల్లో చేసిందేమీ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 87 శాతం హామీలను 100 రోజుల వ్యవధిలో అమలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదు.

- కాళ్ల అప్పలనాయుడు, కేజే పురం, మాడుగుల మండలం

అభివృద్ధి అటకెక్కింది



విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు గత ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేయడం తప్ప కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు. 100 రోజుల పాలనలో అభివృద్ధి అటకెక్కింది. సూపర్ సిక్స్ పథకాలు పేరుతో ప్రజలను దగా చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

- పడాల అప్పలనాయుడు, ఎం.కోడూరు, మాడుగుల మండలం

నమ్మకాన్ని పోగొట్టుకున్న 'కూటమి'



ఈ వంద రోజుల కాలంలో ఒక్క అభివృద్ధి పనిని కూడా ప్రారంభించలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. వందరోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకుంది.

-వర్రి రామునాయుడు, ఎంపీటీసీ, సూదివలస, కె.కోటపాడు మండలం.

అన్ని రంగాల్లోను అభివృద్ధి జరిగేలా పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు : అన్ని రంగాల్లోను రాష్ట్రం అభివృద్ధి చెందేలా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మేడిచర్లలో శుక్రవారం నిర్వహించిన ×ఇది కదా మంచి ప్రభుత్వం¥ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు అభివృద్ధి బాటలో పయనించేలా చేయగల సమర్థ సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఎంపీడీవో అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సర్పంచ్ పూడి వనజ, ఎంపీటీసీ పూడి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో హామీలను నెరవేర్చాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు

రోలుగుంట: వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. రాబోయే వంద రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. తరువాత సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీకి వెళ్లి వారి ఇళ్లకు ×ఇది మంచి ప్రభుత్వం¥ అని ముద్రించిన స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులుపాల్గొన్నారు.

12మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

గొలుగొండ: ఏఎల్‌పురం ప్రాంతంలో 12 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్ఐ టి.దివ్య తెలిపారు. గ్రామానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి మద్యం సీసాలు తరలిస్తున్న సమయంలో సిబ్బంది పట్టుకున్నట్లు చెప్పారు.

ఎస్ఐ చేయి చేసుకున్నారని ఆరోపణ

నర్సీపట్నం: వినాయక నిమజ్జనంలో అకారణంగా మాకవరపాలెం ఎస్ఐ దామోదర్ తనపై చేయి చేసుకున్నారని బాధితుడు రుత్తల వంశీ ఆరోపించారు. గ్రామంలో వినాయక నిమజ్జనాన్ని చూస్తుండగా అక్కడకు వచ్చిన ఎస్ఐ తనను కొట్టారని బాధితుడు తెలిపాడు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంశీని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర పరామర్శించారు.

మద్యం తాగి ఘర్షణ పడ్డారు

ఎస్ఐ దామోదర్‌ను వివరణ కోరగా కొట్టడం అవాస్తవమని తెలిపారు. నిమజ్జనం కార్యక్రమం వద్ద మద్యం సేవించి ఘర్షణ పడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లానని, వంశీ కూడా మద్యం మత్తులో ఉన్నాడని చెప్పారు. తమను చూసి యువకులు పరుగులు తీసే సమయంలో దెబ్బలు తగిలి ఉండవచ్చునని, తానైతే చేయి చేసుకోలేదని తెలిపారు.

వీఆర్‌ఏల సంఘం కార్యవర్గం

మాడుగుల రూరల్: మండల వీఆర్‌ఏల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.కుమార స్వామి, ప్రధాన కార్యదర్శిగా సి.హెచ్. వెంకటరమణ, కార్యదర్శులుగా గాలి కార్తీక్, కచ్చా చిలుకును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫ్రెండ్లీ పోలీసుకు ప్రాధాన్యం

నాతవరం: ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని నాతవరం ఎస్ఐ సీహెచ్. భీమరాజు చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సారా నిర్మూలన, ఈవ్‌టీజింగ్, ర్యాంగింగ్‌కు అడ్డుకట్టవేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అభివృద్ధి ప్రణాళికలివ్వాలి

రోలుగుంట: మండలంలో అన్ని శాఖల పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు అందజేయాలని ఎంపీడీవో కె.ప్రభాకరరావు, మండల గణాంకాధికారి వి.అప్పలనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శాఖల వారీగా అభివృద్ధి ఏ విధంగా చేయాలి, ఏ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి తదితర అంశాలపై అధ్యయన చేసి ప్రణాళికలు రూపొందించి అందజేయాలన్నారు. మండలంలోని ప్రత్యేకతలు గురించి కూడా ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు . ఈ సమావేశంలో ఏపీఎం సాధన, ఎంఈవో-2 జగ్గారావు, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో కృష్ణ, ఏఈలు ఉమామహేశ్వరుడు, రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లులు హైమా, రమ్య, హౌసింగు ఏఈ ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: వచ్చే ఐదేళ్లలో మండలంలో చేపట్టబోయే అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.వి.ఎస్. గోపాలరావు తెలిపారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ విస్తరణాధికారి పి.ఎస్.ఎల్.వి. మీనాకుమారి, ఎంఈవో దేముడమ్మ, కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు, మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన సమాచారం కూడా ఇవ్వరా ?

కె.కోటపాడు : ఇటీవల ఆర్లిలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు పర్యటించారని, ఆ అధికారిక కార్యక్రమ సమాచారాన్ని ప్రొటోకాల్ మేరకు ఎంపీపీ, జెడ్పీటీసీలకు తెలిపే బాధ్యత అధికారులకు లేదా అని చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేష్‌ప్రశ్నించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యటనల సమాచారాన్ని అధికారులు బాధ్యతగా ప్రజాప్రతినిధులకు ఇవ్వాలన్నారు. లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు మాట్లాడుతూ వీఆర్వో పెనగంటి శ్రీనుపై ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదులు చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల విచారణ జరిగిన సమయంలో ప్రజలంతా వీఆర్వోకి మద్దతు పలికారని చెప్పారు. వీఆర్వోకి న్యాయం చేయాలన్నారు. విచారణ నివేదికను డుమా పీడీకి పంపించినట్టు ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు.వ్యవసాయాధికారి సోమశేఖర్, ఎంఈవోప్రసాద్,వైస్ ఎంపీడీవో అప్పలరాజు,డిప్యూటీ తహసీల్దార్ రమేష్, వైస్ ఎంపీపీలు సూర్యనారాయణ,నాగవిజయలక్ష్మి, చీపురపల్లి అచ్చిబాబు, రామునాయుడు, రామలక్ష్మి,గోపి, రొంగలి లక్ష్మి,బంగారి లక్ష్మి,లెక్కల గౌతమి పాల్గొన్నారు.